AKSHARA TODAY
అక్షర టుడే
TOWARDS... TRUTH. TRUST. TREND
www.aksharatodaynews.com


## ఘనంగా వనమహోత్సవం



2



2

## కూరగాయల వ్యాపారుల అవస్థలు


## రాఖీ పండుగ సందర్భంగా ప్రత్యేక బస్సులు



**అక్షరటుడే, ఆర్మూర్ :** పట్టణ పరిసర ప్రాంత ప్రజల సౌకర్యార్థం సికింద్రాబాద్ నుంచి ఆర్మూర్ పట్టణానికి రాఖీ పండుగ సందర్భంగా ప్రత్యేకబస్సులు నడుపుతున్నట్లు ఆర్టీసీ డీఎం ప్రతిమా రెడ్డి తెలిపారు. ఈనెల 27 నుంచి 28 వరకు స్పెషల్ బస్‌లు నడుపుతున్నట్లు పేర్కొన్నారు. ముందస్తుగా టికెట్ బుకింగ్ చేసుకోవడానికి ఆర్మూర్ బస్టాండ్‌లోని రిజర్వేషన్ సౌకర్యాం ఉందన్నారు. ఈ సౌకర్యాన్ని ఆర్మూర్ నియోజకవర్గ ప్రజలు వినియోగించుకోవాలని డీఎం కోరారు.






## ఓటర్లు నోటీసులకు రిప్లయ్ ఇవ్వాలి..

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సర్వేలో భాగంగా నోటీసులు వచ్చిన ఓటర్లు తప్పనిసరిగా సమాధానం ఇవ్వాలని డీసీసీ అధ్యక్షుడు నగేష్ రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు కాంగ్రెస్ భవన్‌లో మంగళవారం మాట్లాడారు. చాలామంది వృత్తిరీత్యా వలస వెళ్లి ఉంటారు కాబట్టి వారు బీఎల్‌వోలు ఇచ్చిన నోటీసులకు సమాధానం ఇస్తే ఓటు ఉంటుందన్నారు. నోటీసులు వచ్చిన వారు తమ చెందిన 11 గుర్తింపు కార్డులో ఏదైనా కార్డును చూపించాలన్నారు. ఈనెల 27న గ్రామ సభల్లో పాల్గొని సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. మరో 20 రోజుల్లో సర్ ప్రక్రియ పూర్తవుతుందన్నారు.



## గవర్నర్‌కు 'జూనియర్ రెడ్‌క్రాస్' ఘన స్వాగతం

**అక్షరటుడే,నిజామాబాద్ సిటీ:** రాష్ట్ర గవర్నర్ శివ్ ప్రతాప్ శుక్లా మంగళవారం నిజామాబాద్ జిల్లా కేంద్రానికి విచ్చేశారు. స్థానిక భూమారెడ్డి కన్వెన్షన్‌లో నషా ముక్త్ భారత్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయనకు జూనియర్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులు రెడ్‌క్రాస్ క్లాప్‌తో ఘనస్వాగతం పలికారు. జిల్లా రక్తదానానికి సంబంధించి చేస్తున్న సేవలను గుర్తించిన గవర్నర్ కార్యక్రమం అనంతరం జూనియర్ రెడ్‌క్రాస్, జిల్లా రెడ్ క్రాస్ కార్యవర్గాన్ని అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర గవర్నర్ సెక్రెటరీ, రాష్ట్ర ఛైర్మన్ రెడ్ క్రాస్ దాన కిషోర్, జిల్లా ఛైర్మన్ ఆంజనేయులు, రెడ్‌క్రాస్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు తోట రాజశేఖర్, జిల్లా కోశాధికారి రవీందర్, నిజామాబాద్ డివిజన్ ఛైర్మన్ శ్రీశైలం, జిల్లా జూనియర్ రెడ్‌క్రాస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ అబ్బాపూర్ రవీందర్, మోపాల్ ఛైర్మన్ వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.







# రైతు సంక్షేమమే
# దేశ సౌభాగ్యానికి పునాది

రైతుల సంక్షేమమే రాష్ట్ర, దేశ సంక్షేమమని రాష్ట్ర గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా అన్నారు. పసుపు సాగులో ఆధునిక సాంకేతికత, సహజ వ్యవసాయ పద్ధతులు, ప్రాసెసింగ్ ద్వారా రైతుల ఆదాయాన్ని పెంచాలని పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలో పసుపు బోర్డు కార్యాలయంలో రైతులను సన్మానించారు. అంతకుముందు ఆయన భూమారెడ్డి కన్వెన్షన్‌లో 'నషా ముక్త్ భారత్' కార్యక్రమంలో విద్యార్థులనుద్దేశించి ప్రసంగించారు.

– అక్షరటుడే నిజామాబాద్ సిటీ




- గవర్నర్ శివ ప్రతాప్ శుక్లా
- జిల్లా కేంద్రంలో పర్యటన
- 'నషా ముక్త్ భారత్' కార్యక్రమంలో విద్యార్థులకు అవగాహన
- పసుపు బోర్డు కార్యాలయంలో రైతులకు సన్మానం

జిల్లా కేంద్రంలోని జాతీయ పసుపు బోర్డు ప్రధాన కార్యాలయంలో మంగళవారం పసుపు రైతులతో ముఖాముఖి నిర్వహించారు. రైతుల సమక్షంలో 'సునహరి మిట్టి అభియాన్', మార్కెట్ అనుసంధాన కార్యక్రమాలను గవర్నర్ ప్రారంభించారు. ఉత్తమ రైతు సంఘాలకు గవర్నర్ మెమొంటోలు అందించి అభినందించారు. అనంతరం గవర్నర్ పసుపు రైతులను ఉద్దేశించి మాట్లాడారు. నిజామాబాద్‌కు పసుపు సాగులో ప్రత్యేక గుర్తింపు ఉందని గవర్నర్ అన్నారు. సారవంతమైన నేలలు, రైతుల కష్టంతో ఈ ప్రాంతం దేశంలోని ప్రముఖ పసుపు ఉత్పత్తి కేంద్రంగా ఎదిగిందన్నారు.

### పసుపు బోర్డు ఇక్కడి రైతుల చిరకాల ఆకాంక్ష..

ఇక్కడ జాతీయ పసుపు బోర్డు ప్రధాన కార్యాలయం ఏర్పాటు కావడం ఈ ప్రాంత రైతుల చిరకాల ఆకాంక్షకు ప్రతీకగా నిలిచిందని గవర్నర్ పేర్కొన్నారు. ఎంపీ ధర్మపురి అర్వింద్ ప్రత్యేక చొరవ, ప్రధాని మోదీ ఆశీస్సులతో ఇది సాకారమైందన్నారు. సాగును లాభదాయకంగా మార్చేందుకు ప్రధాని మోదీ అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని చెప్పారు. భారత్‌ను ప్రపంచంలోనే అతిపెద్ద పసుపు ఉత్పత్తిదారుగా కొనసాగించడంతో పాటు.. పసుపు ప్రాసెసింగ్, విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీకి ప్రపంచ కేంద్రంగా అభివృద్ధి చేయడమే జాతీయ పసుపు బోర్డు లక్ష్యమన్నారు.

### సహజ వ్యవసాయం.. ఎగుమతుల ప్రోత్సాహానికి..

సహజ వ్యవసాయం, ఎగుమతుల ప్రోత్సాహానికి దోహదపడే దూరదృష్టితో 'సునహరీ మిట్టీ అభియాన్' కార్యక్రమాన్ని ప్రారంభించామని గవర్నర్ పేర్కొన్నారు. రసాయన ఎరువులు, ఇతర ఇన్‌పుట్లపై ఆధారపడడాన్ని తగ్గించడం ద్వారా నేల సారాన్ని కాపాడడంతో పాటు.. పర్యావరణ పరిరక్షణ, సాగు వ్యయాన్ని తగ్గించేందుకు సహజ వ్యవసాయం తోడ్పడుతుందన్నారు. నాణ్యమైన పసుపునకు అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉందని.. నాణ్యతకు ప్రాధాన్యమిస్తే రైతులకు మెరుగైన ధరలు లభించడంతో పాటు విదేశీ మార్కెట్లకు చేరుకునే అవకాశాలు పెరుగుతాయని తెలిపారు.

### పసుపు బోర్డు అన్నిరకాల ప్రయోజనం..: ఎంపీ అర్వింద్

ఎంపీ ధర్మపురి అర్వింద్ మాట్లాడుతూ,, ఈ ప్రాంత పసుపు రైతుల నాలుగు దశాబ్దాల కలను నిజామాబాద్ కేంద్రంగా జాతీయ పసుపు బోర్డు ఏర్పాటుతో కేంద్రం నెరవేర్చిందన్నారు. బోర్డు ఏర్పాటుతో పసుపు రైతులకు అన్ని విధాలుగా ప్రయోజనం చేకూరుతుందన్నారు. పసుపు క్వింటాలు ఇచ్చే రేటు గతం కంటే పెరిగిందన్నారు. రైతులు సైతం నాణ్యమైన పసుపును పండిస్తే మద్దతు ధర తప్పకుండా లభిస్తుందన్నారు.

### జిల్లాపై ఎల్‌నినో ప్రభావం ఉందా..?

వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు క్రాప్ డైవర్సిటీనీ ప్రోత్సహిస్తున్నారా అని గవర్నర్ ప్రశ్నించారు. ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో తనను కలిసిన జిల్లా వ్యవసాయ శాఖ అధికారితో ఆయన మాట్లాడారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు, జిల్లా ప్రజల జీవన ప్రమాణాలను పెంచేందుకు కృషి చేయాలన్నారు.

### నషా ముక్త్ భారత్ కోసం యువత శ్రమించాలి..

అంతకుముందు నగరంలోని భూమారెడ్డి కన్వెన్షన్‌లో 'నషా ముక్త్ భారత్'లో భాగంగా విద్యార్థులకు అవగాహన కల్పించారు. మాదకద్రవ్యాల ప్రభావానికి యువత దూరంగా ఉండి, విద్య, క్రీడలు, నైపుణ్యాభివృద్ధి, నవకల్పన, దేశసేవ వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. ప్రధాని మోదీ నాయకత్వంలో 'నషా ముక్త్ భారత్ అభియాన్' విస్తృత ప్రజా ఉద్యమంగా రూపుదిద్దుకుంటోందని తెలిపారు. మాదకద్రవ్యాలపై యువతలో అవగాహన, చైతన్యం, ఆత్మవిశ్వాసం పెంపొందించడం కూడా ఈ ఉద్యమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఎంపీ అర్వింద్ మాట్లాడుతూ.. నషాతో సర్వం వినాశనమేనన్నారు. యువత, విద్యార్థులు మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలన్నారు. కమిషనరేట్ పరిధిలో పోలీసులు నషా ముక్త్ భారత్ కోసం తీవ్రంగా కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో గవర్నర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దాన కిషోర్, నగర మేయర్ ఉమారాణి, అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్య నారాయణ గుప్తా, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, జాతీయ పసుపు బోర్డు అధ్యక్షుడు పల్లె గంగారెడ్డి, కలెక్టర్ భవేష్ మిశ్రా, సీపీ సాయి చైతన్య పాల్గొన్నారు.












## పొంగిపొర్లుతున్న పోచారం ప్రాజెక్ట్..

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** నాగిరెడ్డిపేట మండలంలోని పోచారం ప్రాజెక్టు పొంగిపొర్లుతుంది. దీంతో నిజాంసాగర్ జలాశయానికి వరద కొనసాగుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 1,405.00 అడుగులు కాగా, ప్రస్తుత నీటిమట్టం 1401.32 అడుగులకు చేరింది. పూర్తి సామర్థ్యం 17.802 టీఎంసీలకు గాను ప్రస్తుతం 12.857 టీఎంసీల నీరు నిల్వ ఉంది. గత ఏడాది ఇదే రోజు 1404.43 అడుగులుగా నమోదైంది. స్పిల్‌వే గేట్లు, జెన్ కో, ప్రధాన కాలువ ద్వారా నీటి విడుదల లేదని, ఆవిరి రూపంలో 206 క్యూసెక్కులు మాత్రమే పోతుందని అధికారులు తెలిపారు. పోచారం ప్రాజెక్టు నుంచి వచ్చే నీరు నిజాంసాగర్‌కు చేరుతోంది. అటు సింగితం రిజర్వాయర్‌కు 975 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరగా, అదే మొత్తాన్ని నిజాంసాగర్ ప్రధాన కాలువకు మళ్లిస్తున్నారు. కల్యాణి ప్రాజెక్టుకు 331 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తోందని అధికారులు తెలిపారు.




## ఎక్సైజ్ ఉద్యోగుల సంక్షేమానికి కృషి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లా ఎక్సైజ్ ఉద్యోగుల సంక్షేమానికి కృషి చేస్తామని నూతనంగా ఎన్నికైన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ హెడ్ కానిస్టేబుల్స్, కానిస్టేబుల్స్ అసోసియేషన్ నూతన కమిటీ పేర్కొంది. మంగళవారం జిల్లా ఎక్సైజ్ అధికారి నందగోపాల్‌ను కమిటీ బాధ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి కార్యాలయంలో మంగళవారం బాసర జోన్ పరిధిలో ఇటీవల ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ హెచ్‌సీ, కానిస్టేబుల్స్ అసోసియేషన్ నూతన కమిటీ ఎన్నికైంది. కమిటీకి ఛైర్మన్‌గా కైలాస్ పవార్, వైస్ ఛైర్మన్‌గా లింబాద్రి, కోశాధికారిగా చల్లా బాబు కలిసి జిల్లా ఎక్సైజ్ అధికారిని కలువగా ఆయన నూతన కమిటీకి శుభాకాంక్షలు తెలిపారు.

## కామారెడ్డి రైల్వే స్టేషన్‌లో భారీగా గంజాయి పట్టివేత



**అక్షరటుడే, కామారెడ్డి:** జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్‌లో ఎక్సైజ్, రైల్వే టాస్క్‌ఫోర్స్ పోలీసులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించారు. దీంట్లో భాగంగా ఎండు గంజాయి పట్టుబడింది. సంబల్‌పూర్ నుంచి నాందేడ్ వెళ్తున్న ఎక్స్‌ప్రెస్ రైలులో గంజాయి రవాణా జరుగుతోందన్న పక్కా సమాచారంతో అధికారులు స్టేషన్‌లో నిఘా పెట్టారు. ఈ క్రమంలో రైల్వే స్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని వద్ద ఉన్న బ్యాగును తనిఖీ చేశారు. తనిఖీలో బ్యాగులో 2 కిలోల చొప్పున నాలుగు ప్యాకెట్లు, మరో కిలో ప్యాకెట్ కలిపి మొత్తం 9 కిలోల గంజాయి ప్యాకెట్లు లభ్యమయ్యాయని అధికారులు తెలిపారు. పట్టుబడిన నిందితుడిని మధ్యప్రదేశ్ రాష్ట్రానికి చెందిన కిషన్ పటేల్‌గా గుర్తించారు. తన స్నేహితుడికి ఇచ్చేందుకు తీసుకెళ్తున్నానని నిందితుడు చెబుతున్నప్పటికీ, విక్రయించేందుకే తరలిస్తున్నట్లు అనుమానిస్తున్నామని ఎక్సైజ్ అధికారులు పేర్కొన్నారు. నిందితుడిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేశామని, తదుపరి విచారణ కొనసాగుతోందని ఎక్సైజ్ ఎస్సై విక్రమ్ కుమార్ తెలిపారు. దాడుల్లో ఆర్పీఎఫ్ ఎస్సై జి. వెంకటేశ్వర్లు, ఏఎస్సై పి. రవీంద్రబాబు, సిబ్బంది బయ్యాలు, బాలా సాహెబ్, చంద్రశేఖర్, మీనాక్షి, శివాని, ఎక్సైజ్ ట్రైనీ ఎస్సైలు శ్రీనివాస్, మధు, అనిల్, రచన, సిబ్బంది ఫరీద్, పవన్, బాబు, రాజు, దినేష్, రమ పాల్గొన్నారు.

## 27న టీజీఈజేఏసీ నిజామాబాద్ ఆధ్వర్యంలో ధర్నా




**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** టీజీఈజేఏసీ నిజామాబాద్ ఆధ్వర్యంలో ఆధ్వర్యంలో ధర్నాచౌక్‌లో ఈనెల 27న ఆందోళన నిర్వహించనున్నట్లు టీజీఈజేసీ జిల్లా ఛైర్మన్, టీఎన్జీవోస్ జిల్లా అధ్యక్షుడు నాశెట్టి సుమన్ కుమార్ పేర్కొన్నారు. ఈ మేరకు నగరంలోని సంఘం కార్యక్రమంలో మాట్లాడారు. టీజీఈజేఏసీ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 27న ఉదయం పదిగంటలకు ధర్నా చౌక్‌లో ధర్నా చేపట్టనున్నట్లు వివరించారు. ఆరు పెండింగ్ డీఏలను విడుదల చేయాలని.. రెండో పీఆర్సీ అమలు చేయాలన్నారు. ఉద్యోగులకు రావాల్సిన పెండింగ్ బిల్లులు ప్రతినెలా రూ. 2 వేల కోట్లు చెల్లించాలని డిమాండ్ చేశారు. సీపీఎస్‌ను రద్దు చేసి, ఓపీఎస్‌ను వెంటనే అమలు చేయాలని, ఉద్యోగుల నూతన ఆరోగ్య పథకం విధివిధానాలు అమలు చేసి తక్షణమే ఆరోగ్య సేవలు ప్రారంభించాలని కోరారు. ఇలా మొత్తంగా 64 అంశాలతో కూడిన ఉద్యోగుల డిమాండ్లను త్వరితగతిన పరిష్కరించేందుకు ప్రభుత్వం కృషి చేయాలన్నారు. ఈ సమస్యల పరిష్కారం కోసం నిర్వహించబోతున్న మహా ధర్నాకు అన్ని శాఖల ఉద్యోగులు, అధికారులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులందరూ హాజరుకావాలని కోరారు.

## మొక్కలు నాటి సంరక్షించాలి: ఎస్పీ రాజేష్ చంద్ర



**అక్షరటుడే, కామారెడ్డి:** మొక్కలునాటడం మాత్రమే కాదని.. వాటిని సంరక్షించడం కూడా మనందరి బాధ్యత అని ఎస్పీ రాజేష్ చంద్ర అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న వనమహోత్సవంలో భాగంగా జిల్లా పోలీసు కార్యాలయం ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపుదల ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. ప్రతి ఒక్కరూ తమ పరిసరాల్లో మొక్కలు నాటి వాటిని కాపాడాలని కోరారు. ఇలా చేయడం వల్ల పర్యావరణ సమతుల్యతతో పాటు భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణం అందుతుందని తెలిపారు. వనమహోత్సవాన్ని స్ఫూర్తిగా తీసుకుని ప్రజలు, యువత, విద్యార్థులు పెద్దఎత్తున మొక్కలు నాటాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ నర్సింహారెడ్డి, ఏఆర్ డీఎస్పీ ఉదయభాస్కర్, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మధుసూదన్, ఆర్ఐలు సంతోష్ కుమార్, నవీన్, కృష్ణ, ఆర్ఎస్ఐ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు సొంత భవనం ఏర్పాటు చేయాలి



**అక్షరటుడే, బాల్కొండ:** మండల కేంద్రంలో మూడేళ్లుగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల కొనసాగుతున్నప్పటికీ విద్యార్థులకు సరిపడా తరగతి గదులు లేక తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని విద్యార్థి సేన నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు విద్యార్థి సేన బాల్కొండ మండల అధ్యక్షుడు సూర్య ప్రకాష్ ఆధ్వర్యంలో ఆర్మూర్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. కళాశాలలో మొదటి, రెండో, మూడో సంవత్సరం విద్యార్థులతో పాటు వివిధ కోర్సులకు 200 మందికి పైగా అడ్మిషన్లు వచ్చినప్పటికీ, అన్ని తరగతులకు కలిపి కేవలం రెండు గదులు మాత్రమే కేటాయించారని తెలిపారు. అన్ని కోర్సులకు కేవలం రెండు గదులు సరిపోకపోవడంతో లెక్చరర్లు పాఠాలు బోధించడంలో, విద్యార్థులు తరగతులకు హాజరు కావడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సేన నాయకులు వికాస్, శశి తదితరులు పాల్గొన్నారు.



కరవమంటే కప్పకు కోపం.. విడవమంటే పాముకు కోపం అన్నట్టుగా తయారైంది కూరగాయల రైతుల పరిస్థితి. తైబజార్ పన్ను వసూళ్లు మాత్రం క్రమం తప్పకుండా చేస్తున్నా రైతులకు కనీస సౌకర్యాలు మాత్రం అధికారులు కల్పించడం లేదు. దీంతో కూరగాయలు విక్రయించే రైతన్నలు ఎండనక.. వాననక అవస్థలు పడుతున్నారు.

– అక్షరటుడే, కామారెడ్డి

# పన్నులు ఘనం.. వసతులు శూన్యం

- కామారెడ్డి పట్టణంలో రోడ్లపైనే కూరగాయాల విక్రయాలు
- ఒక్కో రకానికి రూ.10 చొప్పన వసూలు
- నెలకు లక్షల్లో వసూళ్లు.. సమస్యల పరిష్కారం నిల్

కామారెడ్డి పట్టణంలో రైతులకు ప్రత్యేకంగా కూరగాయలు విక్రయించేందుకు సరైన వసతుల్లేవు. అంతో ఇంతో పాత బస్టాండ్ డెయిలీ మార్కెట్‌లో కూర్చోవడానికి స్థలం ఉంది. కొత్త బస్టాండ్‌లో మాత్రం పరిస్థితి భిన్నంగా ఉంది. కొత్త బస్టాండ్ సీఎస్ఐ మైదానంలో తాత్కాలికంగా రైతులు కూరగాయలు విక్రయించుకునేందుకు అవకాశం కల్పించారు. వేసవి, చలికాలంలో ఎలాంటి సమస్యలు లేకున్నా వర్షాకాలంలో మాత్రం కూరగాయలు విక్రయించడానికి రైతుల కష్టాలు అంతాఇంతా కాదు. మైదానంలో వర్షం పడితే బురదమయంగా మారడంతో ప్రమాదమని తెలిసినప్పటికీ దేవునిపై భారం వేసి రోడ్లపైనే కూరగాయలు విక్రయిస్తున్నారు.

### తైబజార్ వసూళ్లు

రైతులకు వసతులు ఉన్నా లేకపోయినా తైబజార్ పన్ను మాత్రం ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. కూరగాయలతో పాటు ఉల్లిగడ్డలు, ఎల్లిగడ్డలు, ఆలుగడ్డలులాంటి ఇతర వాటిని విక్రయించే బేరకాళ్లకు ప్రతిరోజు రూ.50 చొప్పున పన్ను వసూలు చేస్తున్నారు. ఇక గ్రామాల నుంచి వచ్చే రైతుల నుంచి ఒక్కో రకానికి రూ.10 చొప్పున ఎన్ని రకాల కూరగాయలు ఉంటే అన్నింటికీ రూ.వసూలు చేస్తున్నారు.

### లక్షల్లో వసూళ్లు.. వసతులు నిల్..

కొత్త బస్టాండ్ వద్ద సుమారు 10 మందికి పైగా వ్యాపారులు కూరగాయల వ్యాపారం చేస్తున్నారు. వీరి వద్ద రోజుకు రూ.50 చొప్పున తైబజార్ డబ్బులు వసూలు చేస్తున్నారు. అలాగే ఇక గ్రామాల నుంచి వచ్చే రైతులు సుమారుగా 20 నుంచి 30 మందికి పైగా ఉంటారు. ఒక్కొక్కరు మూడు నుంచి ఐదు రకాల కూరగాయలు తెచ్చి విక్రయిస్తున్నారు.

30 మంది రైతులకు రూ.30 నుంచి రూ.50 చొప్పున ప్రతినెలా తైబజార్ పేరిట పన్ను వసూలు చేస్తున్నారు. అయితే ఇంత మొత్తంలో వసూలు చేసి ఆదాయం గడుస్తున్నా మున్సిపల్ అధికారులు మాత్రం రైతులకు శాశ్వతంగా కూర్చుని కూరగాయలు విక్రయాలు జరిపేలా వసతులు కల్పించడంలో మాత్రం విఫలం అవుతున్నారు.



### పట్టింపులేని నాయకులు

రైతన్న కష్టాలు పడుతుంటే నాయకులు మాత్రం వారి కష్టాన్ని చూసి పలకరించిన పాపాన పోవడం లేదన్న ఆరోపణలున్నాయి. బస్టాండ్ ప్రాంతంలో మున్సిపాలిటీకి చెందిన కాస్త స్థలాన్ని రైతులకు కేటాయించి శాశ్వత పరిష్కారం చూపాల్సిన నాయకులు వారిని పట్టించుకోవడం లేదన్న వాదన వినిపిస్తోంది. రైతే రాజు అనే మాట వేదికలపై చెప్పుకోవడానికే తప్ప ఆచరణలో మాత్రం సాధ్యం చేయలేరా అని రైతాంగం ప్రశ్నిస్తోంది. ఇకనైనా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకుని కొత్త బస్టాండు ప్రాంతంలో కూరగాయలు విక్రయిస్తున్న రైతుల సమస్యలకు పరిష్కారం చూపుతారా లేదా అనేది వేచి చూడాలి.



## అన్నాసాగర్‌లో ఘనంగా వన మహోత్సవం

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండలంలోని అన్నాసాగర్‌లో మంగళవారం వన మహోత్సవానికి ఘనంగా నిర్వహించారు. గ్రామంలో కాలువ గట్టుపై అధికారులు, ప్రజా ప్రతినిధులు ఈత చెట్లను నాటారు. పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపుదలే లక్ష్యంగా కార్యక్రమాన్ని చేపట్టారు. భవిష్యత్ తరాలకు పచ్చని వాతావరణాన్ని అందించాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని ఆర్డీవో ప్రభాకర్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎక్సైజ్ శాఖ అధికారులు, ఏఎంసీ డైరెక్టర్, ఫారెస్ట్ శాఖ అధికారులు, సర్పంచ్ స్రవంతి సాయగౌడ్, ఉప సర్పంచ్, గౌడ సంఘం సభ్యులు, సంఘం ప్రెసిడెంట్ మొగులా గౌడ్, పంచాయతీ వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి, గ్రామ పెద్దలు, యువకులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటారు. గ్రామాభివృద్ధిలో, పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని సర్పంచ్ ఈ సందర్భంగా కోరారు.



## మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాలకు రాఖీ కట్టిన ఆర్పీలు



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** రాఖీ పౌర్ణమి సందర్భంగా అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాలను నిజామాబాద్ అర్బన్ ఎంఈపీఎంఏ ఆర్పీల అధ్యక్షురాలు శ్రీమతి స్వర్ణలత, ఆర్పీలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గణేష్ బిగాలకు వారు రాఖీలు కట్టి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. సోదరసోదరీమణుల అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి సందర్భంగా ఆర్పీలను కలవడం సంతోషంగా ఉందని బిగాల పేర్కొన్నారు.



మీసంపల్లి గ్రామంలో..

## ఘనంగా వనమహోత్సవం



ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలోని పలు చోట్ల ఘనంగా వన మహోత్సవం నిర్వహించారు. ఇందులో భాగంగా ఎల్లారెడ్డి పట్టణంలో మోడల్ స్కూల్‌లో మున్సిపల్ పాలకవర్గం ప్రతినిధులు, అధికారులు మొక్కలు నాటారు. అలాగే మీసంపల్లి గ్రామంలో ఆర్డీవో ప్రభాకర్, మార్కెట్ కమిటీ ఛైర్‌పర్సన్ రజిత వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. నాగిరెడ్డిపేట్ మండలం మాల్తుమ్మెదలో జై వృక్ష మాతా నినాదంతో చెట్లకు రాఖీలు కట్టి 'వృక్ష రక్షా బంధన్' కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే ఆర్మూర్‌లో మున్సిపల్ ఛైర్మన్ గోనే లహరి మొక్కలు నాటారు.

– అక్షరటుడే, ఎల్లారెడ్డి/ఆర్మూర్



ఎల్లారెడ్డి పట్టణంలోని మోడల్ స్కూల్లో మొక్కలు నాటుతున్న మున్సిపల్ పాలకవర్గం ప్రతినిధులు, అధికారులు



మొక్కలే ప్రాణికోటికి జీవనాధారం అని ఆర్మూర్ మున్సిపల్ ఛైర్ పర్సన్ గోనే లహరి రఘు

## ఎల్లారెడ్డిలో హెచ్‌పీవీ టీకా కార్యక్రమం పర్యవేక్షణ

**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** మండల కేంద్రంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో నిర్వహించిన హెచ్‌పీవీ టీకా కార్యక్రమాన్ని డిప్యూటీ డీఎంహెచ్‌వో నర్సింగ్ చౌహాన్ సందర్శించి పర్యవేక్షించారు. గర్భాశయ ముఖద్వార క్యాన్సర్ నివారణకు బాలికలకు హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ చాలా ముఖ్యమన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టిందని ఆయన తెలిపారు. టీకా అనంతరం పాటించాల్సిన జాగ్రత్తలపై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మత్మల్ పీహెచ్‌సీ వైద్యాధికారి శరత్, సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



## 'ఛలో ఢిల్లీ' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** 'ఛలో ఢిల్లీ' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి సుధాకర్ పేర్కొన్నారు. ఈ మేరకు పార్టీ కార్యాలయంలో వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా, కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జంతర్ మంతర్‌లో సెపెటంబర్ 1న చేపట్టనున్న బహిరంగసభలో పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. గత 12ఏళ్ల క్రితం బీజేపీ దేశంలో అధికారంలోకి రాగానే ప్రతి కుటుంబానికి రూ.15 లక్షలు ఖాతాలో వేస్తామని హామీఇచ్చి అధికారంలోకి వచ్చాక మాట తప్పిందన్నారు. నిత్యావసర వస్తువుల ధరలను రోజూ పెంచుతూ ప్రజలపై భారాలను మోపుతున్నదని ఆరోపించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి పేరు మార్చడంతో పాటు నిధులను తగ్గించడం దుర్మార్గమన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా నాయకులు అనిల్, ఆలీ ఇమ్రాన్, ఫిరోజ్, ఆనంద్, రమేష్, అనురాధ పాల్గొన్నారు.




## వర్నిలో కలకలం..

## మాజీ సర్పంచ్ దారుణ హత్య

**అక్షరటుడే, బాన్సువాడ:** మాజీ సర్పంచ్ దారుణ హత్యకు గురయ్యాడు. ఈ ఘటన వర్ని మండలంలో కలకలం రేపింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వర్ని మండలం లోని తగిలేపల్లి గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ మైసమ్ వెంకటేష్ (55) అలియాస్ వెంకన్నకు.. అదే గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ బక్క నారాయణకు భూ వివాదం ఉంది. వీరు ఇద్దరు సర్వే నంబర్ 392లో సాగు చేస్తున్నారు. అయితే ఈ సర్వేనంబర్‌లో వెంకన్న ఆరు ఎకరాల్లో సాగు చేస్తుండగా.. బక్క నారాయణ రెండెకరాల్లో పంట పండిస్తున్నారు. అయితే తనకు మరో రెండు ఎకరాలు ఇవ్వాలని నారాయణ.. ఇచ్చేది లేదని వెంకన్న తరచూ గొడవ పడేవారు. ఈ విషయమై సోమవారం ప్రజావాణిలో సైతం నారాయణ ఫిర్యాదు చేశాడు. సోమవారం సాయంత్రం పొలం వద్ద వీరిద్దరికి మరోసారి గొడవ జరిగింది. దీంతో కోపోద్రిక్తుడైన బక్క నారాయణ వెంకన్నను గొడ్డలితో నరికి హత్య చేశాడు. అనంతరం మంగళవారం ఉదయం 5.30 గంటలకు వర్ని పోలీస్‌స్టేషన్‌లో లొంగిపోయాడు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని విచారణ చేస్తున్నారు.

## ఎల్లారెడ్డి శాఖ గ్రంథాలయానికి పుస్తకాల విరాళం



**అక్షరటుడే, ఎల్లారెడ్డి:** పాఠకుల కోరిక మేరకు ఎల్లారెడ్డి శాఖ గ్రంథాలయానికి ప్రభుత్వ జూనియర్ కళాశాల తరపున ఇంటర్మీడియట్ పుస్తకాలను అందజేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సతీష్ ఇంటర్మీడియట్ ఫస్ట్ ఇయర్, సెకండ్ ఇయర్‌కు సంబంధించిన పుస్తకాలను శాఖ గ్రంథాలయ గ్రంథ పాలకులు ఎం.జాకీర్‌కు అందజేశారు. ఈ పుస్తకాలు పోటీ పరీక్షలకు, ఇంటర్ విద్యార్థులకు ఎంతో ఉపయోగపడతాయని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సతీష్, కళాశాల లైబ్రేరియన్, గ్రంథ పాలకులు ఎంఏ జాకీర్ తదితరులు పాల్గొన్నారు.

## స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ..

**అక్షరటుడే, ఆర్మూర్ :** ఆలూర్ మండలంలోని మచ్చర్ల, గగ్గుపల్లి, దేగాం గ్రామంలో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్‌లు మాట్లాడుతూ.. స్మార్ట్ రేషన్ కార్డుల ద్వారా ప్రజలకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, నిత్యావసర సరుకుల పంపిణీలో మరింత పారదర్శకత ఏర్పడుతుందని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాలు అందేలా గ్రామ పంచాయతీ తరపున అవసరమైన సహకారం అందిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, రేషన్ డీలర్ లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



## ఎడపల్లిలో విషాదం..

## పాముకాటుతో వ్యక్తి మృతి



**అక్షరటుడే, బోధన్:** ఎడపల్లిలోని అంబెంలో విషాదం నెలకొంది. ఇంట్లో నిద్రిస్తున్న వ్యక్తిని పాము కాటు వేయగా చికిత్స అందించినప్పటికీ పరిస్థితి విషమించి మృతి చెందాడు. అంబెం గ్రామంలో సోమవారం తన ఇంట్లో గంగా కిషన్ నిద్రించగా.. ఇంట్లోకి ప్రవేశించిన పాము అతడిని కాటు వేసింది. దీంతో వెంటనే స్పందించిన కుటుంబసభ్యులు అతడిని బోధన్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో వెంటనే నిజామాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి చికిత్స పొందుతూ అతడు మంగళవారం మృతి చెందాడు. గంగాకిషన్ మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.